క్లుప్తంగా

పల్లకీ ఊరేగింపు



అమ్మవారి పల్లకీని ఊరేగిస్తున్న దృశ్యం

ఆదోని అర్బన్: స్థానిక మండిగిరి మున్సిపల్ కాలనీలో వెలిసిన మాతా పరమేశ్వరి దేవాలయంలో మంగళవారం పౌర్ణమిని పురస్కరించుకుని దేవాలయ ప్రాంగణంలో అమ్మవారి పల్లకీ సేవ నిర్వహించారు. ఆలయ కమిటీ వారి ఆధ్వర్యంలో పల్లకీ సేవ చేపట్టగా, గ్రామ పురవీధులగుండా పల్లకీని ఊరేగించారు. కాలనీవాసులు రాగసుధ, రూతమ్మ, పరిమళ, మంగమ్మ, ఆలయ పూజారి మల్లయ్యస్వామి తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల ప్రదానోత్సవం



సర్టిఫికెట్‌ను ప్రదానం చేస్తున్న మెప్మా ప్రాజెక్టు మేనేజర్ వీరారెడ్డి తదితరులు

ఆదోని అర్బన్: నాబార్డు ప్రాంతీయ కార్యాలయం వారి ఆర్థిక సహకారంతో గ్లోబల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అడ్వాన్స్ బ్యూటీషియన్ ట్రైనింగ్ ప్రోగ్రాం ముగింపు సందర్భంగా మంగళవారం సర్టిఫికెట్ల ప్రదానోత్సవం జరిగింది. మహిళా స్వయం సహాయక బృందం సభ్యులకు ఉచితంగా 15 రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. మంగళవారం శిక్షణ ముగింపు అనంతరం మెప్మా ప్రాజెక్టు మేనేజర్ వీరారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు రిటైర్డ్ టీచర్ ప్రసాద్ చేతులమీదుగా సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. ఎఫ్ఎల్‌సీ కౌన్సిలర్ శివుడు, ఏపీఎం జనార్దన్, విజయ భాస్కర్, మాట్లాడుతూ.. ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేయాలని సూచించారు.

విద్యార్థినులకు అవగాహన



విద్యార్థినులకు సూచనలిస్తున్న సభ్యులు

ఆదోని అర్బన్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా నోబుల్ ఒకేషనల్ కాలేజీలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కౌమార దశలో బాలబాలికలు ఎదుర్కొనే సమస్యలు, వాటిని ఎలా పరిష్కరించుకోవాలి అనే విషయాలను డాక్టర్లు మరియు లయన్స్ క్లబ్ సభ్యులు వివరించారు. యుక్త వయస్సులో మానసికంగా, శారీరకంగా ఎదుర్కొనే సమస్యలు, ప్రమాదాలకు గురికావడం, ఒత్తిడితో ఆత్మహత్యలు, మద్యం, మాదకద్రవ్యాలకు బానిస కావడం తదితర సమస్యలపై అవగాహన కల్పించారు. ఇండియన్ ఐఎంఏ అధ్యక్షురాలు ఉషారావు, సెక్రటరీ కిరణ్‌కుమార్, సెంట్రల్ వర్కింగ్ మెంబర్ గోపీనాథ్, స్టేట్ వర్కింగ్ మెంబర్ క్రిష్ణమూర్తి, హరీష్, డాక్టర్లు అనూష, రమామణి, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ ధర్మారెడ్డి పాల్గొన్నారు.

శ్రీవల్లి గ్రామైక్య సంఘానికి అవార్డు



అవార్డు అందుకుంటున్న గ్రామైక్య సంఘం లీడర్లు

ఆదోని రూరల్: విజయవాడ సెర్ప్ కార్యాలయంలో మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఉత్తమ గ్రామైక్య సంఘం అవార్డును ఆదోని మండలం మండగిరిలోని శ్రీవల్లి గ్రామైక్య సంఘానికి పీఆర్ అండ్ ఆర్‌డీ కమిషనర్ రాజశేఖర్, సెర్ప్ సీఈఓ ఇంతియాజ్ చేతులమీదుగా అందజేశారు. ఆ గ్రామైక్య సంఘం లీడర్లు సరస్వతి, సుభాషిణిలకు అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా దినోత్సవం రోజున అవార్డును ప్రదానం చేయడం సంతోషంగా ఉందన్నారు. తమ గ్రామైక్య సంఘం ద్వారా మహిళలు ఆర్థికంగా రాణించేలా మరింతగా కృషి చేస్తామన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

మంత్రాలయం రూరల్: ఈ నెల 13వ తేదీన జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో భాగంగా మంగళవారం మంత్రాలయంలోని పోలింగ్ కేంద్రాలను సీఐ శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎన్నికల రోజు ఓటు వేయడానికి వచ్చే ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ముఖ్యంగా వికలాంగులకు ప్రత్యేక క్యూలైన్ ఉంటుందన్నారు.

- స్థానిక సర్కిల్ కార్యాలయంలో మండల పరిధిలోని మహిళా పోలీసులతో సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ వేణుగోపాల్‌రాజు సమావేశం నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలతో మమేకం కావాలని ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అక్రమ మద్యం అమ్మకందారులపై నిఘా ఉంచాలన్నారు. రికార్డులను సక్రమంగా ఉంచుకోవాలన్నారు.

అలివేణి.. ఆణిముత్యం

ఒకరిది సేవా దృక్పథం, మరొకరిది బాధ్యతాయుతం, ఇంకొక్కరిది ఆదర్శనీయం. ఈ ముగ్గురమ్మల జీవితాలు పలువురికి స్ఫూర్తిదాయకం. ఇరువురు భర్తలు లేకున్నా భారం మోస్తున్నారు. కన్నబిడ్డలను ఉన్నత చదువులు చదివించి పూల బాటలు వేస్తున్నారు. ఇంకో ఆమె తన జీవితాన్నే అనాథలకు అంకితం చేసింది. వారి జీవితాల్లో వెలుగులు నింపుతోంది. – మంత్రాలయం



కష్టాలు దిగమింగి..



ఈమె పేరు మంజుల. కోసిగి మండలం డి.బెళగల్ గ్రామ వాసి. భర్త సత్యరెడ్డి అనారోగ్యంతో 2011లో తనువు చాలించాడు. అప్పటి నుంచి కుటుంబ భారం ఆమెపై పడింది. కొడుకు దివాకర్‌రెడ్డి, కూతురు నాగరత్న పోషణ, చదువులు, బాగోగులు చూసుకోవడం కష్టమైంది. మూడు ఎకరాల వర్షాధార పొలాన్ని కౌలుకు ఇచ్చి దినకూలి పనులు చేసుకుంటూ జీవన ప్రయాణం మొదలు పెట్టింది. రూ.2.50 లక్షలు అప్పు ఉండేది. ఎకరాకు రూ.8 వేలు చొప్పున ఏటా రూ.24 వేలు కౌలు ఆదాయం వస్తుంది. రోజువారీగా కూలీ పనులకు వెళుతూనే పిల్లలను కష్టపడి చదివించుకుంది. కుమార్తెను టీటీసీ చదివించి 6 నెలల క్రితం కట్నకానుకలు ఇచ్చి పెళ్లి చేసింది. కుమారుడు దివాకర్ తిరుపతి ప్రభుత్వ కళాశాలలో ఎంసీఏ పూర్తి చేసి ప్రస్తుతం హైదరాబాద్ ఇన్ఫోసిస్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. కుటుంబ పెద్ద దిక్కును కోల్పోయినా అధైర్య పడకుండా అన్నీ తానై కుటుంబ భారం మోస్తూ పిల్లలను ఉన్నతస్థాయికి తీసుకొచ్చింది. కుమారుడు ఉద్యోగం చేస్తుండడంతో చాలా సంతోషంగా ఉందని పేర్కొంటోంది.

అనాథలకు మాతృమూర్తి

ఈ ఫొటోలో చిన్నారులతో ఉన్న ఈమె పేరు ముత్తులక్ష్మి. మంత్రాలయం మండలం ఖగ్గల్ గ్రామానికి చెందిన మారెమ్మ, ఆంజనేయులు కూతురు. చిన్నతనంలోనే అమ్మను కోల్పోయింది. తండ్రి ఆంజనేయులుతో కలిసి బతుకుదెరువు కోసం ముంబైకి వలస వెళ్లింది. అక్కడి కింగ్ సర్కిల్ సమీపంలోని ఆంధ్ర పాఠశాలలో 9వ తరగతి వరకు చదువుకుంది. 1975లో ఓ క్రిస్టియన్ సంస్థ ఉద్యోగిగా పనిచేసింది. ఉద్యోగిగా పనిచేస్తున్న రోజుల్లో సొంత గ్రామం వచ్చిన ఆమె తిరిగి ముంబై వెళ్లేందుకు గ్రామ సమీపంలోని మంత్రాలయం రోడ్డు (తుంగభద్ర రైల్వే స్టేషన్)కు చేరుకుంది. రైలు బండి కోసం ప్లాట్‌ఫాంపై కూర్చుని నిరీక్షిస్తుండగా ముళ్లపొదల్లోంచి ఓ పసికందు ఏడుపు వినిపించింది. పసికందును అక్కున చేర్చుకుని ప్రయాణాన్ని వాయిదా వేసుకుంది. ఇక నుంచి అలాంటి అనాథలకు ఆసరాగా నిలవాలని సంకల్పించింది. ఆమె వద్ద ఉన్న కొంత డబ్బుతో పాటు రాంపురం రెడ్డి సోదరులు ప్రస్తుత ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి కుటుంబం సహాయ సహకారాలతో జ్యోతి అనాథ ఆశ్రమాన్ని నెలకొల్పింది. చెత్త కుండీలు, ఆర్టీసీ బస్టాండ్లు, రైల్వే స్టేషన్లతో వదిలి వెళ్లిన అనాథ శిశువులను చేరదీసింది. వారికి అన్నీ తానై విద్యాబుద్ధులు నేర్పడం ఆరంభించింది. ఇప్పటి దాదాపు 200 మందినిపైగా చేరదీసింది. విద్యాబుద్ధులు నేర్పి 20 మందికిపైగా ఉద్యోగాలు సంపాదించేలా అండగా నిలిచింది. 27 మంది అనాథలకు పెళ్లిళ్లు సైతం చేసింది. ప్రస్తుతం అనాథ ఆశ్రమంలో 15 మంది చిన్నారులు ఆశ్రయం పొందుతున్నారు.



అనాథ చిన్నారులతో ముత్తులక్ష్మి

ఆలనా పాలనా అన్నీ తానే



మంచాన పడ్డ కూతురి ఆలనాపాలనా చూస్తున్న తల్లి జయలక్ష్మి

- 11 ఏళ్లుగా మంచానపడ్డ కుమార్తెకు సేవలు
- పింఛన్, పండ్ల వ్యాపారంతో జీవనం
- కూతురికి వైద్యం చేయించేందుకు తల్లి ఆవేదన

ఆదోని అర్బన్: చిన్న ఇల్లు.. భార్యా, భర్త, ఇద్దరు ఆడపిల్లలు. తండ్రి వస్త్ర దుకాణంలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. పెద్దకుమార్తెకు 13 ఏళ్ల కిందట పెళ్లి చేసి పంపారు. కొద్దిరోజులకు తండ్రి అనారోగ్యం కారణంగా పనిచేయలేకపోయాడు. చిన్న కుమార్తె ఇంటర్ చదువుతోంది. తండ్రి అనారోగ్యం పాలవడంతో చదువు మానేసి వస్త్ర దుకాణంలో పనికి చేరింది. ఇలా ఉండగా ఓసారి జ్వరం రావడంతో ఇంట్లోనే కుప్పకూలిపోయింది. ఆస్పత్రిలో చూపిస్తే ఎస్ఎల్ఈ (ఫేవర్ లూపస్ ఎరిథామాటోస్) వ్యాధి ఉందని వైద్యులు నిర్ధారించారు. అప్పటినుంచి నెలకు రెండుసార్లు ఆస్పత్రిలో చూపించేందుకు రూ.8 వేల వరకు ఖర్చవుతోంది. కుమార్తెకు ఇలా అయ్యిందనే బెంగతో తండ్రి గోపాల్ ఆరోగ్యం మరింత దెబ్బతిని రెండేళ్ల క్రితం మృతిచెందాడు. గత 11 సంవత్సరాల నుంచి భర్త, చిన్న కుమార్తెకు అంతా తానై ఆలనాపాలనా చూస్తూ ప్రభుత్వ పింఛన్‌తో పాటూ పండ్ల వ్యాపారం చేసుకుంటూ జయలక్ష్మి జీవనం సాగిస్తోంది.

పట్టణంలోని వెంకన్నపేటలో నివాసముంటున్న గోపాల్, జయలక్ష్మి దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్దకుమార్తె గౌరికి పెళ్లయి అత్తారింట్లో ఉంటోంది. తండ్రి గోపాల్ అనారోగ్యంతో రెండేళ్ల క్రితం మృతిచెందాడు. చిన్న కుమార్తె సుమలతకు 20 ఏళ్ల వయసులో తీవ్రంగా జ్వరం వచ్చింది. చాలా ఆస్పత్రుల్లో చూపించినా నయం కాలేదు. దీంతో మంచాన పడి నడవలేకపోయింది. చివరికి ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో ఎస్ఎల్ఈ వ్యాధి అని నిర్ధారణ కావడంతో స్టాండు పట్టుకొని కొంతసేపు నడిచేది. ప్రస్తుతం లేవడానికి కూడా రావడం లేదు. మాటలు సరిగా రావడం లేదు. తల్లి జయలక్ష్మికి రూ.2750, కుమార్తె సుమలతకు రూ.3 వేలు పింఛన్ వస్తోంది. దీంతో ఇల్లు గడుపుకుందామనుకుంటే నెలకు రెండుసార్లు కర్నూలులోని ప్రయివేట్ ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించాలి. అందుకు నెలకు రూ.8 వేల వరకు మాత్రలు తదితర వాటికి ఖర్చవుతుంది. దీంతో ఆదోనిలోని చిన్నమార్కెట్ వద్ద జయలక్ష్మి పండ్ల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. తాను ఉన్నంత వరకు ఎలాగైనా బిడ్డ ఆలనాపాలనా చూసుకుంటానని, దాతలు దయ ఉంచి తన కుమార్తెకు మంచి వైద్యం చేయించాలని వేడుకుంటోంది. సాయం చేయాలనుకునే వారు ఫోన్ 91213 04370 నంబర్‌ను సంప్రదించవచ్చు

ఊపందుకున్న ప్రచారం

ఆదోని టౌన్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రతిపాదించిన పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించి రాయలసీమ ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకుందామని మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, పార్టీ పట్టణాధ్యక్షుడు దేవా పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపిద్దామని కోరుతూ మంగళవారం పట్టణంలోని 16, 29, 34 వార్డుల్లో పర్యటించారు. వార్డుల్లో తిరుగుతూ పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి ఓటు అభ్యర్థించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. 14 యేళ్లపాటు పరిపాలించిన టీడీపీ హయాంలో యువత, నిరుద్యోగులను నట్టేట ముంచిన ఘనత చంద్రబాబునాయుడికే దక్కిందని ఆరోపించారు. పట్టణ కన్వీనర్ మధుసూదన్‌శర్మ, కౌన్సిలర్లు, నాయకులు ఇబ్రహీం, శ్రీలక్ష్మి, మహ్మద్‌స్వామి, సాదిక్, రహమాన్, టిప్పు, బాషా, తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దులో ముమ్మర తనిఖీలు

మంత్రాలయం రూరల్: మండల పరిధిలోని మాధవరం గ్రామ శివారులో ఉన్న సరిహద్దు చెక్‌పోస్టు వద్ద సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ కిరణ్ ఆధ్వర్యంలో మంగళవారం వాహన తనిఖీలు ముమ్మరం చేశారు. తనిఖీల్లో భాగంగా కర్ణాటక నుంచి ఏపీలోకి వచ్చే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించి అనుమతిస్తున్నారు. రికార్డులు సక్రమంగా లేని పలు వాహనదారులకు జరిమానా విధించారు.

- మంత్రాలయం మండల కేంద్రంలోని జామీయా మసీదులో షబ్ ఏ బరాత్ సందర్భంగా ముస్లింలతో ఎస్ఐ వేణుగోపాల్‌రాజు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందరూ కలిసికట్టుగా గొడవలకు తావు లేకుండా పండుగ జరుపుకోవాలని సూచించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్‌పై అవగాహన

ఆదోని రూరల్: స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో మంగళవారం ఎంపీడీఓ గీతావాణి ఆధ్వర్యంలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులకు ఓటు వేసే విధానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఓటు వేసే విధానం, ఓటింగ్ సరళిపై చర్చించడం జరిగిందన్నారు. ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అందరూ ఎన్నికల విధి విధానాలను తెలుసుకోవాలని, స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకోవాలని కోరారు.

త్రోబాల్‌లో ప్రతిభ

కౌతాళం: మండల పరిధిలోని బదినేహాల్ గ్రామ జెడ్పీ పాఠశాల విద్యార్థులు త్రోబాల్ టోర్నమెంట్‌లో బంగారం పతకం సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గౌరిశంకర్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం క్రీడాకారులను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లీలాస్ పాఠశాల ఆధ్వర్యంలో జరిగిన ఆదోని జోనల్ లెవల్ అంతర్ పాఠశాలల అండర్-14 బాలుర త్రోబాల్ టోర్నమెంట్‌లో సెయింట్ జోసెఫ్, కిడ్డీస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ఆదోనిపై 15-9 తేడాతో గెలిచి విజయం సాధించినట్లు తెలిపారు. ఈవిజయం పట్ల హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు.



ఏనుగు అంబారిపై చిన్నారిని ఊరేగిస్తున్న దృశ్యం



వెంకన్నపేటలో హోలీ ఆడుతున్న యువత

హోలీ.. ఆనందకేళి

ఆదోని అర్బన్: పట్టణంలోని కిలిచినపేటలో వెలిసిన శ్రీ అంబాభవానీ దేవాలయం వద్ద ఐదు రోజుల పాటు హోలీ పండగ వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు సోమవారం రాత్రి శివపార్వతి, మన్మథుడు విగ్రహాలను రథంపై ఉంచి పురవీధుల్లో ఊరేగించారు. అంబాభవానీ ఆలయం నుంచి ప్రధాన రహదారులగుండా డోలు, సన్నాయిల మధ్య నృత్యం చేసుకుంటూ ఊరేగింపు నిర్వహించారు. మంగళవారం తెల్లవారుజామున రతీమన్మథుల నాటకం ప్రదర్శించి అనంతరం మన్మథుడిని కామదహనం చేశారు. సోమవారం ఉదయం రంగోలీతో ఆ కాలనీవాసులు, పట్టణంలో ఆయా కాలనీలో యువతీ యువకులు రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా పండుగ జరుపుకున్నారు.

ఆదోని టౌన్: పట్టణంలో హోలీ పండగ సందర్భంగా వాడవాడలా రంగులతో కేరింతలు కొట్టారు. చిన్నాపెద్దా తేడా లేకుండా ఆనందంగా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ పండుగ జరుపుకున్నారు. హోలీ..ఆనందకేళి అంటూ నినాదాలు చేస్తూ సంబరాలు చేసుకున్నారు. పట్టణంలోని విక్టోరియాపేట, టీజీఎల్ కాలనీ, జైన్ టెంపుల్, షరాఫ్‌బజార్, ఎన్‌జీవోస్ కాలనీ తదితర ప్రాంతాల్లో హోలీ సంబరాలు అంగరంగ వైభవంగా జరిగాయి. రోడ్లపై యువతీ యువకులు రంగులు చల్లుకుంటూ కేరింతలు కొట్టారు.

అగసనూరులో పారిశుద్ధ్య పనులు



ట్రాక్టర్‌తో మట్టి దిబ్బలు తొలగిస్తున్న దృశ్యం

కోసిగి: మండల పరిధిలోని అగసనూరు గ్రామంలో సర్పంచ్ ఉలిగయ్య ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. మంగళవారం గ్రామంలో వాడవాడలా డ్రయినేజీ కాల్వలను శుభ్రం చేయించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. గ్రామపక్కనే ఇళ్ల మధ్యలో ఉన్న పెంట దిబ్బలను ట్రాక్టర్‌తో తొలగించారు. పెంట దిబ్బలు ఊరు బయట ఉండాలని ఇళ్ల మధ్య ఉండడం వల్ల దోమలు వ్యాప్తి చెందుతున్నాయన్నారు. దీని వల్ల రోగాల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. ఈ మేరకు ప్రజల సహకరించాలని పెంట దిబ్బలు ఊరి బయట వేసుకోవాలని సూచించారు. గ్రామంలోని తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయించారు.

ప్రారంభమైన త్రోబాల్ పోటీలు



విజేత జట్టుతో ఉపాధ్యాయులు

ఆదోని అర్బన్ : లీలాస్ పాఠశాల ఆధ్వర్యంలో ఆదోని జోనల్‌స్థాయి అంతర్ పాఠశాలల అండర్-14 బాలుర త్రోబాల్ పోటీలు ఆ పాఠశాల క్రీడా మైదానంలో మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆదోని జోన్ వ్యాయామ ఉపాధ్యాయ సంఘం లీగల్ అడ్వైజర్ జీవన్‌సింగ్ హాజరై పోటీలను ప్రారంభించారు. పాఠశాల సీఈఓ డాక్టర్ కంబిరెడ్డి, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు నరసయ్య, ఈరన్న, కర్నూలు జిల్లా ఖోఖో అసోసియేషన్ కోశాధికారి ఖలీల్‌అహ్మద్, విజయ సుశీలమ్మ, ఆదోని జోన్ వ్యాయామ ఉపాధ్యాయ సంఘం కోశాధికారి ఆనంద్‌నరసన్న, మల్లికార్జున, రవి కుమార్, గోవిందు, రామాంజనేయులు, డేవిడ్, లక్ష్మీనారాయణ, షాషావలి, మస్తాన్ పాల్గొన్నారు. ఈ టోర్నమెంట్‌లో 12 జట్లు పాల్గొన్నాయి. ప్రథమ స్థానంలో బదినేహాల్ జెడ్పీ పాఠశాల జట్టు, ద్వితీయ స్థానంలో ఆదోని కిడ్డీస్ పాఠశాల జట్టు, తృతీయ స్థానంలో ఆదోని సెయింట్ జోసెఫ్ హైస్కూల్ జట్టు, నాలుగో స్థానంలో ఆదోని నేషనల్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ జట్టు నిలిచాయి. అతిథులు జీవన్‌సింగ్, నవీన్‌రెడ్డి, కరెస్పాండెంట్ రమాదేవి, ప్రిన్సిపాల్ ప్రతిభసింగ్ విజేతలకు బహుమతులను అందజేశారు. సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు నరసయ్య, ఈరన్న, ఏపీ పీఈటీలు మరియు ఎస్ఏపీఈ అసోసియేషన్ అధ్యక్షులు నరసింహులు, ట్రెజరర్ ఆనంద్ పాల్గొన్నారు.

బియ్యం తరలింపుపై విచారణ

వెల్దుర్తి: పట్టణ సమీపంలోని ఉరుకుంద రైస్ మిల్ వద్ద మంగళవారం ఆటోలో అక్రమంగా తరలిస్తున్న 15 బస్తాల బియ్యాన్ని (దాదాపు 9 క్వింటాళ్లు) జోన్ విజిలెన్స్ తహసీల్దార్ వెంకటనారాయణ, ఎస్ఐ జయన్నలు పట్టుకున్నారు. చెరుకులపాడుకు చెందిన ఆటోను సీజ్ చేసి ఓనర్ వెంకటేశ్‌ను అదుపులోకి తీసుకుని విచారించి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆటోలోని బియ్యాన్ని సమీప ఉరుకుంద రైస్‌మిల్‌కు తరలిస్తున్నట్లు తెలుసుకుని రైస్ మిల్లులో సోదాలు నిర్వహించారు. మిల్లులో 80 బస్తాల నూకలు ఉన్నట్లు గుర్తించారు. అక్కడకు చేరుకున్న వెల్దుర్తి తహసీల్దార్ రాజేశ్వరి మాట్లాడుతూ నూకలు రేషన్ బియ్యానికి సంబంధించినవేనా అని విచారిస్తున్నట్లు తెలిపారు. రైస్‌మిల్ ఓనర్ చింతలయ్య, ఆటోడ్రైవర్‌పై కేసు నమోదు చేయాల్సిందిగా స్థానిక పోలీసులను కోరినట్లు విజిలెన్స్ అధికారులు చెప్పారు. బియ్యానికి సంబంధించిన పంచనామా నిర్వహించి పూర్తి వివరాలు జిల్లా ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు రెవిన్యూ అధికారులు వెల్లడించారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

ఎమ్మిగనూరురూరల్: ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మేజిస్ట్రేట్ గురుఅరవింద్ అభిప్రాయపడ్డారు. మంగళవారం సాయంత్రం మండల పరిధిలోని కె.తిమ్మాపురం గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో చిన్న చిన్న విషయాలకు గొడవలు పడకుండా పెద్ద మనుషుల సమక్షంలో సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. చిన్నచిన్న గొడవలకు కోర్టుల చుట్టు తిరగకుండా రాజీ మార్గం ద్వారా కేసులు పరిష్కారం చేసుకోవచ్చన్నారు. లోక్ అదాలత్ ద్వారా కేసులకు సత్వర పరిష్కారం చూపుతున్నామని పేర్కొన్నారు. న్యాయవాదులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

మంత్రాలయం రూరల్: జాతీయ పశువ్యాధి నివారణ కార్యక్రమంలో మండల పరిధిలోని కల్లుదేవకుంట పశు ఆరోగ్య కేంద్రం వద్ద డాక్టర్ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం 200 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. పశువులకు గాలికుంటు వ్యాధి సోకితే తీవ్రమైన జ్వరం, కాళ్ల గిట్టలలో, నోటిలో పుండ్లు ఏర్పడి మేత, నీరు తీసుకోవడానికి బాధపడతాయన్నారు. ఈ వ్యాధి సోకకుండా రైతులు పాడి పశువులకు టీకాలు వేయించాలని కోరారు. వడగాలుల నుంచి రక్షించుకోవాల్సిందిగా హెచ్చరించారు. కల్లుదేవకుంట జూనియర్ పశువైద్యాధికారి వరప్రసాద్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ప్రశాంతత నెలకొల్పాలి



రికార్డులను పరిశీలిస్తున్న సీఐ ఏరిషావలి

కౌతాళం: గ్రామాల్లో ప్రశాంత వాతవరణం నెలకొల్పేందుకు కృషి చేయాలని కోసిగి సీఐ ఏరిషావలి సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఆయన మంగళవారం కౌతాళంలోని పోలింగ్‌బూత్‌లను పరిశీలించారు. ప్రశాంతంగా ఓట్లు వేయాలని సూచించారు. అనంతరం మండలంలోని రౌడూరు, హాల్వి, నదిచాగి పికెట్లను సందర్శించి రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. హాల్వి గ్రామంలో మాట్లాడుతూ.. గ్రామస్తులు కలిసికట్టుగా అభివృద్ధికి పాటుపడాలని, మారుతున్న కంప్యూటర్ యుగంలో చదువుకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని, పిల్లలను ఉన్నత చదువులు చదివించడం వల్ల ఫ్యాక్షన్‌ను రూపుమాపవచ్చన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



దూదేకుల హాసన్ (ఫైల్)

నందవరం: బోరు పైపు లైన్ తీస్తుండగా దూదేకుల హాసన్ (48) అనే రైతు విద్యుత్ షాక్‌తో మృత్యువాత పడ్డాడు. వివరాలు.. మండల పరిధిలోని ఇబ్రహీంపురం కొట్టాల గ్రామంలో బోరు మోటార్ మరమ్మతులకు గురైంది. వ్యవసాయ కూలీలతో కలిసి పైపులు పైకి తీస్తుండగా పైన ఉన్న విద్యుత్ తీగలను తగలడంతో విద్యుదాఘాతానికి గురై రైతు కుప్పకూలిపోయాడు. అదృష్టవశాత్తు కూలీలు కాడను పట్టుకుని ఉండటంతో ప్రాణాలతో బయటపడ్డారు. కాసేపటికి అప్రమత్తమైన కూలీలు పైపులను వదిలేసి రైతు హసన్‌ను కాపాడే ప్రయత్నం చేశారు. హుటాహుటిన ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. భార్య మహబూబ్ బీ ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ ఆంజనేయులు కేసు నమోదు చేసుకున్నారు. మృతుడికి కుమారుడు, కూతురు ఉన్నారు.